# సాహితీ ఇన్‌ఫ్రా భూముల జప్తు

**హైదరాబాద్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** ప్రీలాంచ్ పేరిట మూడు వేల మంది అమాయకులను నిండా ముంచి వందల కోట్ల రూపాయలను కాజేసిన సాహితీ ఇన్‌ఫ్రా సంస్థకు చెందిన భూములను సిసిఎస్ పోలీసులు జప్తు చేసి ప్రభుత్వ పరం చేశారు. ఈ సంస్థకు సంబంధించి ఎపి, తెలంగాణలో వున్న భూములను సిసిఎస్ పోలీసులు గుర్తించారు. ఈ సంస్థ అపార్ట్‌మెంట్‌లను తక్కువ ధరకు నిర్మిస్తామని హామీ ఇచ్చి అమాయకులను నిండా ముంచడం తెలిసిందే. ఈ సంస్థను నమ్మి మోసపోయిన బాధితులు అనంతరం సిసిఎస్‌లో ఫిర్యాదు చేయగా ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సంస్థ ఎండి బూదాటి సత్యనారాయణ సహా ఇతర నిందితులను అరెస్టు చేసి కొంత ఆస్తిని స్వాధీనం చేసుకున్నారు. కాగా ఈ సంస్థకు సంబంధించి గుంటూరులో 24 ఎకరాలను సిసిఎస్ పోలీసులు గుర్తించి దానిని సర్కారు పరం చేశారు. ఈ భూమిలో 56 మంది అమాయకులకు ప్లాట్లు, పార్కులు నిర్మిస్తామని నమ్మించిన సాహితీ సంస్థ వారిని కూడా మోసం చేసినట్లు తేలింది.

# తెలంగాణలో ఐదుగురు ఐఎఎస్‌ల బదలీలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం మరోసారి ఐఏఎస్‌ను బదిలీ చేసింది. ఈ మేరకు ఐదుగురు ఐఏఎస్‌లకు స్థానచలనం కలిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు. సిద్దిపేట్ కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్‌ను ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ స్పెషల్ సెక్రటరీగా బదిలి చేశారు. ఆ స్థానంలో కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) మిక్కిలినేని మనుచౌదరిని నియమించారు. అలాగే వరంగల్ మున్సిపల్ కమిషనర్ షేక్ రిజ్వాన్‌భాషాను జనగాం జిల్లా కలెక్టరుగా, అక్కడి కలెక్టర్ శివలింగయ్యను సాధారణ పరిపాలన శాఖలో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించారు. పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రెవెన్యూ(ఎండోమెంట్) ముఖ్యకార్యదర్శి బాధ్యతలను అదనంగా అప్పగించారు. ఇంతకాలం అదనపు హోదాలో ఆ బాధ్యతలను చూస్తున్న సునీల్‌శర్మను అక్కడి నుండి రిలీవ్ చేశారు.

## చివరి బంతివరకూ ఉత్కంఠగా సాగిన తొలిమ్యాచ్

### ఢిల్లీ కేపిటల్స్‌పై ముంబయి ఇండియన్స్ విజయం

**బెంగళూరు, ఫిబ్రవరి 23 :** మహిళలప్రీమియర్ లీగ్ రెండో ఎడిషన్ తొలిమ్యాచ్‌లోనే ఉత్కంఠపోరునడిచింది. చివరిబంతివరకూ సాగిన పోరులో ఢిల్లీ కేపిటల్స్‌పై ముంబయి ఇండియన్స్ నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఢిల్లీ నిర్దేశించిన 172 పరుగుల టార్గెట్‌ను ముంబయి సరిగ్గా 20 ఓవర్లలోపూర్తి చేసింది. ఐదు పరుగులు అవసరం కాగా సజన ఆరు చివరి బంతిని సిక్స్‌గామలిచి ముంబయిని గెలిపించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కౌర్ 55, యస్తికాభాటియా 57 పరుగులతో అర్థశతకాలుసాధించారు. నాట్ స్కివెర్ 19, అమెలియా కెర్ 24 పరుగులు చేసి జట్టుకు స్కోరును పెంచారు. ఢిల్లీ బౌలర్లు అరుంధతి రెడ్డి రెండు, ఎలీస్ కాప్సే రెండు, మరిజన్నె, శికాపాండే చెరో వికెట్ తీసారు. అంతకుముందు తొలుత బ్యాటింగ్‌చేసిన ఢిల్లీ నిర్ణీత 20 ఓవర్లలో 171 పరుగులుచేసింది. ముంబయి జట్టుకు లక్ష్యఛేదనలో తొలినుంచే షాక్ తగిలింది. హీలే మాథ్యూస్ డకౌట్ అయింది. యస్తికాభాటియాతోకలిసి నాట్‌స్కివెర్ రెండో వికెట్‌కు 50 పరుగులుజోడించి కొంత మెరుగుపరిచింది.

# ఓఆర్ఆర్‌పై ఆగని మృత్యుఘోష



## ప్రాణాలు హరిస్తున్న అతివేగం.. ప్రముఖులకు విషాదం

## మిగుల్చుతున్న రోడ్డు ప్రమాదాలు

## స్పీడ్‌గన్‌లున్నా జరిమానాలకే పరిమితమవుతున్న పోలీసులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో జరుగుతున్న పలు రోడ్డుప్రమాదాలు ప్రముఖులకు శోకాన్ని మిగుల్చుతున్నాయి. వారితోపాటు వారి పిల్లలు రహదారులపై ఖరీదైన వాహనాలతో అతివేగంతో వెళుతూ ప్రమాదాల బారినపడుతూ ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు పెరిగిపోతున్నాయి. విదేశాల్లో విశాలమైన రోడ్లపై రేసు గుర్రంలా రయ్‌మంటూ వెళ్లే వాహనాలు ఇండియాలోని రహదారులపై వెళ్లేందుకు ఎంత మాత్రం పనికిరాని విషయం తెలిసినా ఈ వాహనాలను నడిపే సమయంలో ప్రముఖులతో పాటు వారి పిల్లలు ఏమాత్రం జాగ్రత్తలు తీసుకోవడంలేదు. 12 యేళ్ల శ్రీకాకుళం జిల్లాలో తెలుగుదేశం ముఖ్యనేత ఎర్రంనాయుడు ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి లోనయిన ఘటన మొదలుకొని శుక్రవారం తెల్లవారుజామున పటాన్‌చెరు సమీపంలో ఓఆర్ఆర్‌పై జరిగిన ప్రమాదంలో కంటోన్మెంట్ ఎంఎల్ఎ లాస్య నందిత మరణం వరకు అనేక ఘటనలను పరిశీలిస్తే వాహనదారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. ఎర్రం నాయుడు ప్రయాణించిన కారు వేగంగా వెళుతూ ప్రమాదానికి లోనయితే ముందర కూర్చున ఆయన సీటు బెల్టు ధరించకపోవడంతో తలకు బలమైనగాయం తగిలి మరణించారు. దీని తరువాత తెలుగు దేశం నేత లాల్‌జాన్‌పాషా హైదరాబాద్ నుంచి గుంటూరుకు కారులో వెళుతూ నల్లగొండ జిల్లా చౌటుప్పల్‌వద్ద ప్రమాదానికి గురై దుర్మరణం పాలయ్యారు. లాల్‌జాన్‌పాషా సీటు బెల్టు ధరించి వుంటే ప్రాణాలతో బయటపడే వారని పోలీసులు తెలిపారు. దీని తరువాత తెలుగుదేశం నేత నందమూరి హరికృష్ణ తనయుడు జానకీరాం కారులో గుంటూరు వెళుతుండగా చౌటుప్పల్ వద్ద రాంగ్‌రూటులో వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించపోయి కారు బోల్తా పడడంతో చనిపోయాడు. ఈ ఘటనలోనూ జానకీరాం సీటుబెల్టు ధరించి వుంటే ప్రాణాలు దక్కేవని పోలీసులు తెలిపారు. అనంతరం హరికృష్ణ కూడా చౌటుప్పల్ వద్ద అతి వేగంతో కారులో వెళుతూ ప్రమాదానికి గురై మరణించారు. పూర్వపు మహబూబ్‌నగర్ జిల్లా మైసిగండి వద్ద బిజెపి నాయకురాలు ఝాన్సీ ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి లోనవగా సీటు బెల్టు ధరించకపోవడం వల్ల ఆమె దుర్మరణం పాలయ్యారు.

నాలుగేళ్ల క్రితం అవుటర్ రింగు రోడ్డుపై తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో సీటుబెల్టు ధరించని కారణం వల్లే మాజీ డిజిపి పేర్వారం రాములు మనవడితో పాటు ఇద్దరు మరణించారు. పటాన్‌చెరు వద్ద జరిగిన ప్రమాదంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కుమారుడు ప్రతీక్‌రెడ్డి సహా ఇద్దరు మరణించారు. ఈ ఘటనకు మితిమీరిన వేగం కారణమని తేలింది. ఎపి మంత్రి నారాయణ కుమారుడు నిషీత్ నారాయణ తన స్నేహితుడు రాజారవితో కలిసి మెర్సిడెజ్ బెంజ్ కారులో ప్రయాణిస్తూ జూబ్లీహిల్స్‌లో మెట్రో పిల్లర్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు దుర్మరణం చెందారు. ఈ ఘటనలో వారు ప్రయాణిస్తున్న వాహనం 210 కిలోమీటర్ల వేగంతో వెళుతూ మెట్రో పిల్లర్‌ను ఢీకొనడం వల్ల ఇద్దరు మరణించారు. ఇక తాజాగా పటాన్‌చెరు వద్ద ఓఆర్ఆర్‌పై శుక్రవారం తెల్లవారుజామున కంటోన్మెంట్ ఎంఎల్ఎ లాస్యనందిత కారులో సదాశివపేట్ నుంచి వస్తుండగా డ్రైవర్ మితిమీరిన వేగంతో నడపడం వల్ల అదుపుతప్పి మొదట ముందరగా వెళుతున్న లారీని, ఆ తరువాత రేలింగ్‌ను ఢీకొంది. ఈ ఘటనలో కారు ఎడమవైపు బాగా దెబ్బతినగా డ్రైవర్ పక్కన కూర్చున్న ఎంఎల్ఎ నందిత తలకు గాయాలు తగలడంతో ఘటనా స్థలంలోనే చనిపోయారు. కాగా నందిత సీటు బెల్టు ధరించలేదని, ఒకవేళ ధరించి వుంటే ఆమె బతికి వుండేదని పోలీసులు అంటున్నారు.

**జరిమానాలకే పరిమితమవుతున్న పోలీసులు**

ఇదిలా వుండగా ఓఆర్ఆర్‌పై తరచూ రోడ్డు ప్రమాదాలు వెలుగు చూస్తుండడం గమనార్హం. ప్రమాదాలు జరగడానికి వాహనదారుల మితిమీరిన వేగం ఒక కారణం కాగా సరుకు రవాణా చేసే భారీ వాహనాలు పరిమితికి మించి సరుకులను లారీలపై వుంచుతుండడం వల్ల రాత్రి వేళల్లో వెనకాల వస్తున్న వాహనాలు చివరి నిమిషం వరకు వీటిని గుర్తించలేక పోతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. దీంతో పాటు ఓఆర్ఆర్‌పై చెడిపోయిన వాహనాలను రోడ్డుమీదే ఆపుతుండడం వల్ల కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. మరోవైపు అ వేగంతో వెళుతున్న వారిని కట్టడి చేసేందుకు పోలీసు, రవాణా శాఖ స్పీడ్ గన్‌లతో వాహనదారులను పట్టుకుంటున్నా వారికి జరిమానాలతోనే సరిపుచ్చుతోంది. వాహన దారులు పట్టుబడితే వారి లైసెన్స్‌లను శాశ్వతంగా రద్దు చేయడంతో పాటు నాలుగైదు నెలల జైలు శిక్ష విధించడం లాంటివి చేస్తే వాహనదారులు కచ్చితంగా భద్రతా ప్రమాణాలను పాటించి, ప్రమాదాలకు దూరంగా ఉంటారని నిపుణులు అంటున్నారు.

# లాస్య నందిత భౌతికకాయానికి పలువురి నివాళులు



**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కంటోన్మెంట్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత భౌతికకాయానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నివాళులు అర్పించారు. సికింద్రాబాద్ కార్ఖానాలోని ఆమె నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. సిఎం వెంట మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు ఉన్నారు.

**మాజీ సిఎం చంద్రబాబు సంతాపం**

కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత మృతి చెందడం పట్ల మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. తండ్రి సాయన్న చనిపోయిన ఏడాదిలోపే లాస్యనందిత మృతి చెందడ దురదృష్టకరమని, ఆమె ముందు ఉజ్వల భవిష్యత్తు ఉండగా, విధి మరొకటి తలచిందని, లాస్య నందిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని, ఆమె శ్రేయోభిలాషులు, స్నేహితుల నుంచి వస్తున్న ప్రేమ, మద్దతు ఆ కుటుంబానికి బలాన్ని చేకూర్చాలని ఆకాంక్షించారు.

**మాజీ ఎంసి కెసిఆర్ సంతాపం**

కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత మృతి పట్ల బిఆర్ఎస్ అధినేత, మాజీముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు సంతాపం తెలిపారు. రోడ్డు ప్రమాదంలో ఆమె ఆకాల మరణం చెందడం ఎంతో బాధాకరమన్నారు. అతిపిన్న వయస్సులో ఎమ్మెల్యేగా నందితప్రజల మన్ననలు పొందారని, కష్టకాలంలో వారి కుటుంబానికి బిఆర్ఎస్ అండగా ఉంటుందని అన్నారు. లాస్య నందిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతి పట్ల ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు సంతాపం ప్రకటించారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

**యువ శాసనసభ్యురాలిని కోల్పోవడం బాధాకరం: కెటిఆర్**

కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత అకాల మరణం పట్ల బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సంతాపం వ్యక్తంచేశారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. లాస్య లేరనే అత్యంత విషాదకరమైన, షాకింగ్ న్యూస్ తెలుసుకున్నానని అన్నారు. దాదాపు వారం క్రితమే ఆమెను పరామర్శించాననని, అంతలోనే మళ్లీ ప్రమాదానికి గురై మృతి చెందడం బాధాకరమన్నారు.

**గుత్తాసుఖేందర్‌రెడ్డి సంతాపం**

చిన్నవయస్సులోనే ఎమ్మెల్యేగా గెలుపొందిన లాస్య నందిత మృతి ఎంతో బాధ కలిగించిందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి వివరించారు. ఆమె కుటుంబసభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యం కలిగించాలన్నారు.

**నివాళులు అర్పించిన తలసాని**

ఎంతో భవిష్యత్తు కలిగిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత రోడ్డు ప్రమాదంలో మృతిచెందడ చాలా బాధాకరమని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. రోడ్డు ప్రమాదంలో లాస్యనందిత మరణించిన విషయం తెలుసుకున్న ఆయన తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. పోస్టుమార్టం నిమిత్తం ఆమె పార్థివదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తీసుకొస్తున్న విషయం తెలుసుకున్నఆయన అక్కడికిచేరుకున్నారు. అక్కడ లాస్య తల్లి, సోదరిలను ఓదార్చి తన ప్రగాఢ సంతాపం తెలిపారు.

**చాలా బాధాకరం: ఎంపి వద్దిరాజు రవిచంద్ర**

చిన్నవయసులో ఎమ్మెల్యేగా ఎన్నికై...తన తండ్రి దివంగత మాజీ ఎమ్మెల్యే సాయన్న ఆశయాలను ముందుకు తీసుకుపోతూ అందరి మన్ననలు పొందిన నందిత అకాల మృతి తీవ్ర బాధాకరమని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తెలిపారు. ఏడాది కింద సాయన్న మరణం, ఇప్పుడు ఆయన కూతురు మృతి చెందడం విచారకరమన్నారు. లాస్య నందిత అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని, ఆమె కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి సంతాపం తెలిపారు.

**బిఆర్ఎస్‌కు తీరనిలోటు: మాజీ మంత్రి వేముల**

లాస్య నందిత మరణం కంటోన్మెంట్ ప్రజలకు తీరని లోటని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# అత్యాధునిక సంతానోత్పత్తి చికిత్సలు పేదలకు చేరాలి

## గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

### మూడు రోజుల సమావేశానికి హాజరు

**హైదరాబాద్ (తార్నాక), ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** అత్యాధునిక సంతానోత్పత్తి చికిత్సలు పేదలకు చేరాలని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరాజన్ పేర్కొన్నారు. పునరుత్పత్తి ఆరోగ్యంపై అంతర్జాతీయ సదస్సు, ఐఎస్ఎస్ఆర్ఎఫ్ 2024....34వ వార్షిక సమావేశాన్ని శుక్రవారం తార్నాకలోని ఐఐసీటీలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గవర్నర్ తమిళి సై సౌందరాజన్ హాజరై జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడుతూ పునరుత్పత్తి ఆరోగ్యం, సంతానోత్పత్తికి చికిత్స అందరికి అందుబాటులో ఉండేలా ఆవిష్కరణలు చేయాలని సూచించారు. ముఖ్యంగా ఈ ఆవిష్కరణలు గ్రామీణ ప్రాంతాలకు చేరాలని కోరారు. కొన్ని పునరుత్పత్తి పద్ధతులు పట్టణ, ఉన్నత విద్యావంతులకే అందుతున్నాయన్నారు. తాను స్వయాన గైనికాలజీ డాక్టర్‌నని తనకు గ్రామీణ ప్రజల సమస్యలు తలుసునన్నారు. సంతానోత్పత్తి సమస్యలు, కుటుంబ భావోద్వేగాలతో ముడిపడి ఉన్నాయన్నారు. వాటిని సూక్ష్మ బుద్ధితో ఏకీకృతంగా ఎదుర్కోనేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయూష్ అల్లోపతి ఔషధాలను ఏకీకృతం చేసేందుకు ప్రధాన మంత్రి నరేంద్రమోది కృషి ఎంతో గొప్పదన్నారు. కోవిడ్ వాక్సిన్‌ను తయారు చేసేందుకు మన సైంటిస్టులు, మోది ప్రభుత్వం కృషి ఎంతో ఉందన్నారు. ఐఎస్ఎస్ఆర్ఎఫ్..2024 కార్యనిర్వాహక కార్యదర్శి డా. రోయా రోజాటి సదస్సు నిర్వహించేందుకు చేసిన కృషిని గవర్నర్ అభినందించారు. ఈ సందర్భంగా కార్యదర్శి డా. రోయా రోజాటి మాట్లాడుతూ మూడు రోజుల సమావేశంలో పరిశోధనపై శాస్త్రీయ పత్రాలు, ప్రసంగాలు, ప్రోటోకాల్, చర్చలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. గవర్నర్ ఐఎస్ఎస్ఆర్ఎఫ్ సావనీర్‌ను విడుదల చేశారు. పునరుత్పత్తి వైద్యరంగంలో విశిష్ట సేవలందించిన వైద్యులకు లైఫ్ టైం అచీవ్‌మెంట్ ఆవార్డులను అందజేశారు.



గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ఐఎస్ఎస్ఆర్ఎఫ్ డా.రోయారోజాటి, పద్మశ్రీ బలరామ్ భార్గవ తదితరులు

# 15 రోజుల్లో హెచ్‌ఎండిఎ, జిహెచ్‌ఎంసిలో విజిలెన్స్ దాడులు

## ఇష్టానుసారంగా వ్యవహరించిన అధికారులు ఇంటికిపోతారు: సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 23:** హెచ్‌ఎండీఏ, జిహెచ్‌ఎంసీలో అవినీతి అధికారుల భరతం పట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సన్నద్ధమయ్యారు. 15 రోజుల్లో హెచ్‌ఎండిఏ, జిహెచ్‌ఎంసీలో విజిలెన్స్ దాడులు జరుగుతాయని, ఇష్టానుసారంగా వ్యవహరించిన అధికారులు ఇంటికపోతారని సిఎం తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. జిహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండిఏ పరిధిలో బిల్డింగ్ పర్మిషన్స్ ఫైల్స్ క్లీయర్‌గా ఉండాలని, చాలా బిల్డింగ్స్ అనుమతులకు సంబంధించిన ఫైల్స్ కనిపించడం లేదని, ఆన్‌లైన్ లేకుండా ఇష్టారీతిగా పర్మిషన్లు ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం హెచ్‌ఎండిఏ కార్యాలయంలో వాటర్ వర్క్స్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, జిహెచ్‌ఎంసీపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్షించారు. ఉదయమే లేచి కాలనీల్లో పర్యటించని జోనల్ కమిషనర్లు ఇంటికి వెళ్లిపోవచ్చనని జోనల్ కమిషనర్లకు సిఎం రేవంత్ హెచ్చరిక జారీ చేశారు. కుర్చీల్లో కూర్చొనే పోస్టులు కావాలంటే ఇస్తామని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో న్యూయార్క్ టైమ్ స్క్వేర్ తరహాలో వీడియో ప్రకటన బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు. మల్టీ యుటిలిటీ టవర్స్‌ను ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వీధి దీపాలు మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

# ఇక రూ.29కే కిలో సన్నబియ్యం

## తెలంగాణలో రైతుబజార్ల ద్వారా సరఫరా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 23:** తెలంగాణలోకి భారత్ రైస్ అందుబాటులోకి రానున్నట్లు నాఫెడ్ తెలుగు రాష్ట్రాల ఇన్‌చార్జ్ వినయ్‌కుమార్ తెలిపారు. 5,10 కేజీల రైస్ బ్యాగుల ద్వారా అమ్మకాలు జరుగుతాయని వివరించారు. రైతు బజార్ల ద్వారా బియ్యం సరఫరా చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా ఇప్పటికే భారత్ ఆట్టా(గోదుమపిండి), దాల్‌లాంటివి కూడా పలు స్టోర్లలో అందుబాటులో ఉంచామని వివరించారు. కాగా, రోజురోజుకు దేశ వ్యాప్తంగా సన్న బియ్యం ధరలు పెరిగిపోతున్న నేపథ్యంలో ధరలను నియంత్రించేందుకు భారత్ రైస్ పేరుతో సబ్సిడీ సన్న బియ్యాన్ని రి-టైల్ అవుట్‌లెట్ల ద్వారా విక్రయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం మార్కెట్‌లో బియ్యం రేట్లు అవకాశాన్నంటుతున్నాయి. కిలో సన్నబియ్యం రిటైల్ మార్కెట్‌లో రూ.50 నుంచి రూ.60 వరక ఉంది. దీంతో బియ్యం ధరల పెరుగుదలను అరికట్టేందుకు చర్యలు ప్రారంభించిన కేంద్రం రూ.29కే భారత్ రైస్ విక్రయించే దిశగా అడుగులు వేసింది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం భారత్ బ్రాండ్ కింద కిలో శనగపప్పు రూ.60కే విక్రయిస్తుండగా... భారత్ ఆట్టా(గోదుమపిండి) కేజీ రూ.27.50కే విక్రయిస్తోంది. ఇందులో భాగంగానే భారత్ బ్రాండ్ రైస్ తక్కువ ధరకే తీసుకువచ్చింది. కొద్ది రోజుల్లోనే తెలంగాణ రాష్ట్రంలోనూ విరివిగా భారత్ రైస్ సామాన్య, పేద ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి.

# క్రీట్‌లో జిఎంఆర్ విమానాశ్రయం నిర్మాణం

## గ్రీస్ ప్రధాని కిరియాకోస్ మిట్సో సంతోషం

**శంషాబాద్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** గ్రీస్ దేశంలో భారతదేశ పెట్టుబడులు పెట్టడం పట్ల ఆ దేశ ప్రధాని కిరియాకోస్ మిట్సో టాకీస్ ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ నెల 21వ తేదీన ఆ దేశ రాజధానిలో జరిగిన రైసైనా డైలాగ్స్‌లో భారత ప్రధాని నరేంద్రమోడీ సమక్షంలో ఆయన ప్రముఖ వ్యాపారవేత్త గ్రంధి మల్లికార్జున రావును అభినందించారు. గ్రీస్ దేశ ప్రధాని కిరియాకోస్ మిక్సో టాకీస్ గ్రీస్ దేశంలో మౌలిక వసతుల కల్పిన కోసం భారత్ పెట్టుబడులు పెట్టడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఆయన స్వాగ్రామం అయిన క్రీట్‌లో జిఎం ఆర్ సంస్థ విమానాశ్రయాన్ని నిర్మించడానికి ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు.



సంతోషం వ్యక్తం చేస్తున్న గ్రీస్ దేశ ప్రధాని కిరియాకోస్ మిట్సో టాకీస్

# వాజేడులో ఘోర రోడ్డు ప్రమాదం

## ఇద్దరు మృతి

### సెలవుపై వెళ్తున్న సిఆర్‌పిఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ దుర్మరణం

**వాజేడు, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** ములుగు జిల్లా వాజేడు మండలం పాయబాట్ల వద్ద ఆగి ఉన్న లారీని ఏపీ23యు8010 అనే తూఫాన్ వాహనం ఢీకొట్టింది. అతి వేగంగా ఢీకొట్టడంతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వాజేడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఛత్తీస్‌ఘఢ్ నుండి వెంకటాపురం వైపు వెళ్తున్న తుఫాన్ వాహనం రోడ్డు పక్కన పార్కింగ్ చేసి ఉంచిన లారీని వేగంగా ఢీకొట్టడంతో తుఫాన్‌లో ఉన్న సీఆర్‌పిఎఫ్ హెడ్ కానిస్టేబుల్ ఎస్. పెరుమాళ్(50) తోపాటు ఛత్తీస్‌ఘఢ్‌కి చెందిన సురేష్(15)లు అక్కడికక్కడే మరణించారు. తుఫాన్ డ్రైవర్ వెంకటేష్‌కి గాయాలు అవ్వడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

**సిఆర్‌పిఎఫ్ క్యాంపులో విషాదఛాయలు**

మండల పరిధిలోని పేరూరు పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న సీఆర్‌పిఎఫ్ హెడ్ కానిస్టేబుల్ అకాల మృతి చెందటంతో క్యాంపులో విషాదఛాయలు అలుముకున్నాయి. సెలవుపై ఇంటికి బయలు దేరి ఆనంతలోకాలు వెళ్ళటంతో వారు జీర్ణించుకోలేకపోతున్నారు. అంతసేపు తమతో విధులు నిర్వహించి భార్యకు అనారోగ్యంగా ఉందని స్వరాష్ట్రం పుదుచ్చేరి బయలు దేరిన పెరుమాళ్ చనిపోవడంతో సీఆర్‌పిఎఫ్‌తో పాటు పేరూరు, వాజేడు పోలీసులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

# బిసి సబ్‌ప్లాన్ కావాలంటే కులగణన జరగాలి

## డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

### కులగణనలో నిజాయితీగా ఉన్నాం: మంత్రి పొన్నం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 23:** బీసీ సబ్‌ప్లాన్ కావాలంటే కుల గణన జరగాలని డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం సాయంత్రం సచివాలయంలో జరిగిన కులగణన సమావేశంలో ఆయన పలు అంశాలు బీసీ మేధావులతో, అధికారులతో చర్చించి మాట్లాడారు. దేశ సంపద కొద్ది మంది చేతుల్లో ఉందని, ఎక్కువ మంది ప్రజలు కనీస అవసరాలు కూడా తీర్చుకోలేకపోతున్నారని, ఈ అంతరాలు తొలగిపోవాలంటే కులగణన జరగాల్సిందేనని డిప్యూటీ సిఎం అభిప్రాయపడ్డారు. కులగణనకు సంబంధించి వివిధ రాష్ట్రాలతో పాటు బిహార్‌లో ఎటువంటి న్యాయపరమైన చిక్కులు లేకుండా, విజయవంతంగా సర్వే జరిగి చట్టరూపం దాల్చిన తీరును ఆయన అధికారులు అడిగి తెలుసుకున్నారు. కులగణనకు సంబంధించి రాష్ట్ర కేబినెట్ కట్టుబడి ఉందన్నారు. తెలంగాణలో అధికారంలోకి రాగానే కులగణన చేపడుతామని దేశానికి ఆదర్శంగా నిలుస్తామని అసెంబ్లీ ఎన్నికల సమయంలో మా నాయకులు రాహుల్‌గాంధీ స్పష్టం చేశారని డిప్యూటీ సిఎం బీసీ నేతలకు వివరించారు. ఈ అంశానికి సంబంధించి రాహుల్‌గాంధీ ప్రసంగాన్ని తానే అనువాదం చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కులగణన తీర్మానంపై విపక్షంలో కొందరు దారి తప్పించాలని, కుట్ర పూరిత విమర్శలు చేశారు. అసెంబ్లీలో కులగణన తీర్మానం ప్రవేశపెట్టడం ద్వారా ఒక ఘట్టం ముగిసిందని బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మేం నిజాయితీగా ఉన్నాం, కేబినెట్‌లో ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా కులగణన తీర్మానాన్ని ఆమోదించామని తెలిపారు. ఈ విషయాన్ని పబ్లిక్ డిమాండ్‌లో పెట్టామని పొన్నం ప్రభాకర్ తెలిపారు. కులగణన విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్త శుద్ధితో ఉందని ప్రజలకు అర్థమైందని మాజీజస్టిస్ చంద్రకుమార్ అన్నారు.

# ఆందోళనల్లో మరో రైతు మృతి

## యువరైతు కుటుంబానికి కోటి పరిహారం, ఒకరికి ఉద్యోగం: పంజాబ్ సిఎం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23:** రైతు ఆందోళనల్లో ఒప్పటికే ఒక రైతు చనిపోగా ఇపుడు మరో రైతు కూడా చనిపోయినట్లు రైతుసంఘాలు ప్రకటించాయి. పంజాబ్ హర్యానా సరిహద్దుల్లోని ఖానౌరివద్ద జరుగుతున్న నిరసనలతో 62 ఏళ్ల రైతు మృతిచెందినట్లు రైతునాయకుడు సర్వన్‌సింగ్ పంధేర్ వెల్లడించారు. పంజాబ్‌కిసాన్ మజ్దూర్‌సంఘర్ష్‌కమిటీకి నాయకుడగా వ్యవహరిస్తున్నారు. చనిపోయిన రైతు దర్శన్‌సింగ్ భటిండా జిల్లాలోని అమర్‌ఘర్ గ్రామస్తుడని ఆయన ప్రకటించారు. రైతు ఆందోళనల్లో నాలుగో రైతు చనిపోయాడని, అయినాప్రభుత్వాలు స్పందించడంలేదని పంధేర్ వెల్లడించారు. రైతు కుటుంబానికి ఐదు లక్షలపరిహారం చెల్లించాలని, అంతకుముందు ఇచ్చినట్లుగానే దర్శన్‌సింగ్ కుటుంబానికి పరిహారం ఇవ్వాలని కోరారు. ఇప్పటికే 21 ఏళ్ల యువరైతు సుభాకర్ సింగ్ చనిపోయిన సంగతి తెలిసిందే. హర్యానా పోలీసులు, రైతులమధ్య జరిగిన ఘర్షణల్లో ఈ యువరైతు తీవ్ర గాయాలపాలయి చనిపోయాడు. అంతకుముందే 73 ఏళ్ల రైతు గుండెపోటుతో చనిపోగా మరో 63 ఏళ్ల రైతు కూడా శంభు సరిహ ద్దుల్లో గుండెపోటుతో మృతి చెందాడు. రైతు లపై పోలీసు దాష్టీకానికి నిరసనగా రైతు సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీ బ్లాక్‌డేగా ప్రకటించింది. ఖానౌరి, శంభు సరిహద్దుల్లోట్రాక్టర్ ట్రాలీలు, ట్రక్కులతోనే వారుప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వ మొండి పట్టుకు నిరసనగా రైతులు ఈ నెల 26వ తేదీ దేశవ్యాప్తంగా ట్రాక్టర్లు, ట్రాలీలతో రోడ్లపై నిరసన ర్యాలీలునిర్వహించాలని పిలుపునిచ్చింది.

**యువరైతు కుటుంబానికి కోటి పరిహారం**

కాగా పంజాబ్ హర్యానా సరిహద్దుల్లో జరిగిన ఘర్షణల్లో మృతిచెందిన యువరైతు శుభకరణ్‌సింగ్ కుటుంబానికి కోటిరూపాయలు పరిహారం అందిస్తున్నట్లు పంజాబ్ సీఎం భగవంత్‌మాన్‌ప్రకటించారు. కోటిరూపాయల నగదుతోపాటు కుటుంబసభ్యులకు ఒక ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని, శుభ్‌కరణ్‌మృతలికి కారణమైన పోలీసులపై చర్యలు తప్పవని సీఎం

